కేటీఆర్‌ను కలిసిన కార్పొరేటర్

దసరా పండుగను పురస్కరించుకుని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలను వారి నివాసాలలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

– మియాపూర్, అక్టోబర్ 15

జిల్లా దవాఖానలో వైద్యులకు ఆహ్వానం

కొండాపూర్, అక్టోబర్ 15: శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్య సేవలందించేందుకు అర్హులైన వైద్యులు అక్టోబర్ 19వ తేదీన దవాఖాన ఆవరణలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దవాఖానలో 20 పోస్టులకు వైద్యులను నియమించనున్నట్లు, అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్వయంగా హాజరవ్వాల్సిందిగా తెలిపారు. అన్ని రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య విధాన పరిషత్‌తో కలిసి పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వైద్య సిబ్బందికి రూ. లక్ష నెలసరి వేతనం చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

దుండిగల్,అక్టోబర్15: గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను మంగళవారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను సకాలంలో పూర్తి చేసేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు.డీఈ శిరీష, కాలనీ ప్రెసిడెంట్ చెక్క సురేశ్‌బాబు, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 15: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 47, వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 85, కాకరకాయ 38, బీరకాయ 38, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 45, కాలీఫ్లవర్ 23, దొండ 40, చిక్కుడు 65, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 25, క్యాప్సికం 65, ఆలుగడ్డ 37, కీరా 23, దోసకాయ 40, సొరకాయ 25, పొట్లకాయ (1) 23, కందగడ్డ 65, ఉల్లిపొరక 55 , ఉల్లిగడ్డ 45, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 37, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 15, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 10 నుంచి 12, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 60గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 15: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పార్కులు, గ్రేవీయార్డ్‌లు, కమ్యూనిటీహాళ్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. మంగళవారం కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో నియోజకవర్గ సమస్యలపై జడ్సీతో ఎమ్మెల్యే కృష్ణారావు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీలు, బస్తీల్లో ప్రజల అవరాలను తీర్చేందుకు పార్కులు, గ్రేవీయార్డ్‌లు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. చేపట్టిన పనులు మధ్యలోనే ఆగిపోయాయని, ఆ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు కేటాయించి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి జడ్సీ అపూర్వ చౌహాన్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్ ఉన్నారు.

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్‌తో సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

మల్లన్నను దర్శించుకున్న పీఏసీ చైర్మన్

తన పుట్టినరోజును పురస్కరించుకుని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ కొమరవెల్లి మల్లిఖార్జునస్వామి వారితోపాటు కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు గాంధీకి వేద ఆశీర్వచనం అందించి స్వామి వార్ల ప్రసాదాలను, శేష వస్త్రాలను అందచేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కార్పొరేటర్లు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పీఏసీ చైర్మన్ గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

– మియాపూర్, అక్టోబర్ 15

గాంధీ విగ్రహం ధ్వంసం

హైదర్‌నగర్ డివిజన్ ప్రగతీనగర్ అంబీర్ చెరువు సమీపంలో గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. జయంతిని పురస్కరించుకుని ఇటీవలే ఈ విగ్రహం ఏర్పాటు చేశారు. జనసంచారం అంతగా లేకపోవడంతో మద్యం తాగేందుకు మందుబాబులు అక్కడే తిష్ట వేస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మద్యం మత్తులో ఎవరైనా ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారానన్న సందేహాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఘటన తమ దృష్టికి రాలేదని కేపీహెచ్‌బీ పోలీసులు పేర్కొన్నారు.

– మియాపూర్, అక్టోబర్ 15

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి

సూరారం కాలనీ రెండవ ఓం జెండా ప్రాంతంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

దుండిగల్, అక్టోబర్ 15: కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్, సూరారం కాలనీలోని రెండవ ఓం జెండా ప్రాంతంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని సూరారం కాలనీకి చెందిన సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పందిరి యాదగిరి కోరారు. ఈ మేరకు సర్కిల్ ఉపకమిషనర్ నర్సింహను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పందిరి యాదగిరి మాట్లాడుతూ.. సూరారం కాలనీలోని రెండవ ఓం జెండా వద్ద ఓ వ్యక్తి 142 గజాల స్థలంలో అక్రమంగా జీ+4 విత్ పెంట్ హౌజ్ అంతస్థులతో బహుళ అంతస్థుల నిర్మాణం చేపట్టాడని ఆరోపించారు. నిర్మాణదారుడు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, రోడ్డును సైతం కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. కనీస సెట్ బ్యాకులు వదలడం లేదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతూ నిర్మించిన ఈ నిర్మాణంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరగా.. డీసీ సానుకూలంగా స్పందించారన్నారు.

ప్రజా సమస్యలపై పాదయాత్ర

శ్రీసాయినగర్‌లో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, సీనియర్ నాయకులు కాసాని వీరేశ్ తదితరులు

దుండిగల్, అక్టోబర్ 15 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ శ్రీసాయినగర్‌లో మంగళవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కాసాని వీరేశ్ ముదిరాజ్, స్థానిక కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, ఓపెన్‌నాలా పనులను, అలాగే దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని డిప్యూటీ మేయర్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు సాంబశివారెడ్డి,జలగం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కలాం దేశానికి చేసిన సేవలు మరవలేనివి

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేశ్‌రెడ్డి

జీడిమెట్ల, అక్టోబర్ 15 : మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ గుడిమెట్ల హేమలత సురేశ్‌రెడ్డి అన్నారు. భారత రత్న భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే కలాం జయంతి సందర్భంగా మంగళవారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలోని ఆయన విగ్రహానికి కార్పొరేటర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, డిజిబుల్డ్ సంక్షేమ సంఘం సభ్యులు, పెద్దలు, అంజయ్య, సత్యం, యాదగిరి, నర్సింహ, అరుంధతి, ఆంజనేయులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో వెన్నెముక సమస్యలు, పరిష్కార మార్గాలపై అవగాహన

డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

కొండాపూర్, అక్టోబర్ 15: ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైటెక్‌సిటీలోని మెడికవర్ దవాఖానలో వెన్నెముక ఆరోగ్యం, సమస్యలు, చికిత్స విధానాలపై సీనియర్ కన్సల్టెంట్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మంది వెన్ను నొప్పి సమస్యలతో బాధపడుతున్నారని, సరైన భంగిమ, క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన ఆహారం తీసుకోవడం, సక్రమ నిద్రలతో వెన్నెముక ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వికృత భంగిమలో ఎక్కువ సేపు కూర్చోవడం, ధూమపానం, స్టెరాయిడ్స్ తీసుకోవడం, ఎముకలకు హానిచేసే ఆహార పదార్థాలు తీసుకోవడం, కణితులు, ఇన్ఫెక్షన్ల ద్వారా వెన్నెముక సమస్యలు తలెత్తుతాయన్నారు. సరైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయడం ద్వారా సమస్యలు తగ్గించుకోవచ్చన్నారు.

మద్యం మత్తులో భవనంపై నుంచి పడి యువకుడి మృతి

కిశోర్(ఫైల్)

కొండాపూర్, అక్టోబర్ 15 : మద్యం మత్తులో తాను ఉంటున్న భవనం (రెండవ అంతస్తు)పై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... చందానగర్ పాపిరెడ్డి కాలనీలో నివాసం ఉండే నందకుమార్ షాప్‌లో పని చేసేందుకు రాజస్థాన్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వర్కర్లను తీసుకువస్తాడు. కాగా, రాజస్థాన్‌కు చెందిన కిశోర్(25)ను షాప్‌లో పని చేసేందుకు చందానగర్‌కు తీసుకువచ్చాడు. కిశోర్ మరో నలుగురు బీహార్‌కు చెందిన వర్కర్లతో కలిసి చందానగర్‌లో నివసిస్తున్నారు. ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం షాప్ నుంచి బయటకు వెళ్లిన కిశోర్ మద్యం సేవించి రాత్రి 7 గంటలకు తిరిగివచ్చాడు. మద్యం మత్తులో ఉన్న కిశోర్‌ను షాప్ యజమాని నందకుమార్‌ను ఇంటికి పంపించాడు. రాత్రి 11 గంటలకు కిశోర్ మిగతా వాళ్లతో కలిసి భోజనం చేసి గది బయటే పడుకున్నాడు. మద్యం మత్తులో ఉన్న కిశోర్ తాముంటున్న రెండవ అంతస్తు నుంచి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన కిశోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కౌన్సిలర్లు

కుత్బుల్లాపూర్,అక్టోబర్15:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం రూ.2 కోట్ల 26 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌లతో పాటు కౌన్సిలర్లు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. అపర్ణఫామ్ మెడోస్‌లో రూ.98 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులు, 1వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో ఓపెన్‌జిమ్, ఐదవ వార్డులోని నూజీవీడు వద్ద రూ.70లక్షల వ్యయంతో వీధిదీపాలు, ఏడవ వార్డులో రూ.25 లక్షలతో సీసీరోడ్డు పనులు, 8వ వార్డులో రూ.49 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని శివారు మున్సిపాలిటీలను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు భవిష్యత్‌తరాల అవసరాల కోసం కోట్లాది వ్యయంతో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, పూజారి వసంత, ఫాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డితో పాటు అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెజీషియన్ ప్రదర్శనలు

మెజీషియన్ గోపీనాథ్ ముతుకాడ్‌కు శాలువా కప్పి జ్ఞాపికతో అభినందిస్తున్న ఎన్ఎస్‌కేకే స్కూలు ప్రతినిధులు

బాలానగర్, అక్టోబర్ 15 : ఎన్ఎస్‌కేకే హైస్కూలులో ప్రముఖ మెజీషియన్ గోపీనాథ్ ముతుకాడ్ చేసిన ప్రదర్శనలు ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశాయి. మెజీషియన్ గోపీనాథ్ ముతుకాడ్ దేశ పర్యటనలో (కన్యాకుమారీ టు కశ్మీర్) భాగంగా సోమవారం ఫతేనగర్ డివిజన్ పరిధి ఎన్ఎస్‌కేకే హైస్కూలు ఆడిటోరియం హాల్‌లో మలయాళం మిషన్, ఎన్ఎస్‌కేకే హైస్కూలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్‌క్లూసివ్ ఇండియా కార్యక్రమానికి ఆయనతో పాటు తెలంగాణ టూరిజం డిపార్ట్‌మెంట్ ప్రతినిధి మామిడి హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మెజీషియన్ గోపీనాథ్ ముతుకాడ్ చేసిన పలు మెజీషియన్ విన్యాసాలు ఆహూతులను ఆకర్షించాయి. కార్యక్రమంలో ఎన్ఎస్‌కేకే హైస్కూలు కమిటీ సభ్యులు సురేశ్‌కుమార్, సంతోష్, అనిల్ థామస్, కాళిదాస్, అలెక్స్, రామచంద్రన్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యర్థాలు.. పట్టించుకోని అధికారులు

రోడ్డుపై పారబోసిన వ్యర్థాలు

జగద్గిరిగుట్ట, అక్టోబర్ 15 : తరచూ అధికారులు పర్యావరణం, పారిశుధ్యంపై ప్రచారం చేస్తుంటారు. తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉంటారు. ఆచరణలో మాత్రం ప్రజలు అందించిన చెత్తను మాత్రం సరైన రీతిలో నిర్వహించకుండా వదిలేస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు జగద్గిరిగుట్ట డంపింగ్‌యార్డుకు చేరుతాయి. ఆపై ఆధునిక యంత్రాలతో కంప్రెస్ చేసి జవహర్‌నగర్‌కు పంపుతారు. ఇందుకోసం డంపింగ్‌యార్డు నిర్వహణకు ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. బస్తీలు, కాలనీల్లో బహిరంగంగా వేయవద్దని చెత్తకుండీలు లేకుండా చేశారు. ఎవరైనా వ్యక్తులు, ప్రైవేటు సంస్థలు చెత్తపారబోస్తే జరిమానా సైతం విధిస్తుంటారు. ఇదంతా ప్రజల్లో మార్పు రావడంతో కోసమే అని చెబుతుంటారు. నెలరోజులుగా జగద్గిరిగుట్ట హెచ్ఎంటీ స్థలంలోని డంపింగ్ యార్డు ముందే వ్యర్థాలు పాబోస్తున్నారు. రహదారిపై పోయడంతో వర్షానికి కుళ్లిపోతున్నాయి. నెలరోజులుగా ఈ పరిస్థితి ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. చెత్త వాహనాలు, భారీ యంత్రాలు సైతం రహదారిపైనే నిలుపుతున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇకనైనా నియంత్రణా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

సుభాష్‌నగర్ కల్లు డిపో టీసీఎస్ కమిటీ ఎన్నిక

సుభాష్‌నగర్ కల్లు డిపో టీసీఎస్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎక్సైజ్ అధికారి రఫీయుద్దీన్, గౌడ సంఘం ప్రతినిధుల సమక్షంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా అంతటి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా కె.రాజేశ్, డైరెక్టర్లుగా నరసింహ, నాగభూషణం, పద్మలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులకు నియామకపత్రాలను అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అంతటి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సంఘం అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

– కుత్బుల్లాపూర్, అక్టోబర్ 15

బాలానగర్ సీఐ నర్సింహరాజుకు శుభాకాంక్షలు

బాలానగర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నర్సింహరాజుకు బాలానగర్ చిత్తారమ్మ బస్తీ డబుల్ బెడ్‌రూం ఇండ్ల అసోసియేషన్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నర్సింహరాజును కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా దసరా శుభాకాంక్షలు, ముందస్తు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

– బాలానగర్, అక్టోబర్ 15

ప్రభుత్వ పథకాల అమలుకు
ఇందిరమ్మ కమిటీలు

దుండిగల్, అక్టోబర్ 15: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి అధ్యక్షతన పలువురు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కమిటీలను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, పథకాన్ని పక్కాగా అమలు చేయడం కోసం ఇందిరమ్మ కమిటీలను నియమించనుందని తెలిపారు. గృహ నిర్మాణ పథకం కింద ఓపెన్ ప్లాట్లు కలిగి ఉన్న అర్హులైన పేద లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయబడుతుందని, అదే విధంగా భూమిలేని పేదలకు ఇళ్ల స్థలంతోపాటు రూ.5లక్షల సాయం మంజూరు చేయబడుతుందని తెలిపారు. ఈ మేరకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కమిటీల నియామకానికి వారంలోపు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కమిటీలకు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆయా డివిజన్ కార్పొరేటర్ చైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా ఉంటారని, ఈ రెండు కమిటీల్లో స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు, కార్పొరేషన్ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే ముగ్గురిని సభ్యులుగా నియమించనున్నారని, ఈ ముగ్గురిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున నియమించాలని సూచించారు. ఈ కమిటీ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులని ఎంపిక చేస్తుందని, ఎవరైనా అనర్హులను ఎంపిక చేసి లబ్ధి పొందినట్లు తేలితే వారిపై విచారణ జరిపి, నిధులు రాబట్టే అధికారం కమిటీకి ఉంటుందని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి, వెంకటరామయ్య, శ్రీరాములు, రవికిరణ్, గాజుల సుజాత, బాలాజీ నాయక్, ఎం.సుజాత, కో-ఆప్షన్ సభ్యురాలు వాణి, ఎస్.ఈ.సత్యనారాయణ, మేనేజర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

పేదల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ చైర్మన్ రాములు, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 15 : బోడుప్పల్‌లో పేదల ఇండ్ల స్థలాలను రాత్రి రాత్రే నయీం గ్యాంగ్ తరహా ఒక గ్యాంగ్ కబ్జా చేస్తున్నదని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాధితులకు తాము అండగా ఉంటామని వారు తెలిపారు. మంగళవారం బాధితులు చేపట్టిన ఆందోళనకు ఫెడరేషన్ తరుపున మద్దతు తెలిపా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనంబరు 63/1లోని ప్రభుత్వ భూమి లో 19999లో 1150 మంది పేదలకు అప్పటి హోంమంత్రి దేవేందర్‌గౌడ్ పట్టా లు అందజేశారన్నారు. ఆ స్థలంలో దేవేందర్‌నగర్,గౌతంనగర్,సీతారాంనగర్, అం బేద్కర్‌నగర్‌లో ఏర్పడ్డాయన్నారు. పట్టా ఉండి, ఇండ్లు నిర్మించుకోలేని కుటుంబాల ఖాళీ స్థలాలపై కన్నేసిన గ్యాంగ్ ఆ భూమిని ఆక్రమించుకొని, రాత్రి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడుతుందని తెలిపారు. అడ్డుకోబోతున్న బాధితులపై దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికే గ్యాంగ్‌లోని ప్రధాన సూత్రధారులు పలువురిపై కేసులు నమోదైనట్టు తెలిపారు. గ్యాంగ్ అరాచకాలపై పోలీసు, రెవెన్యూ అధికారులు, స్థానిక కార్పొరేటర్ ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని, పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని వారు అన్నారు.